

పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం

పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం

నేరడిగొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల జలపాతం పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో భారీ కురుస్తున్న వర్షాలకు ఆదివారం జలపాతం పొంగి పొర్లుతోంది. దీంతో జలపాతం జలకళను సంతరించుకుంది. ప్రకృతి అందాల నడుమ పాలనురుగులా నీరు జాలువారుతుంటే వచ్చిపోయే పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. అంతేకాకుండా దసరా సెలవుల కారణంగా వాటర్ ఫాల్స్ చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా జలపాతం వద్ద అటవీ శాఖ అధికారులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆరుగురు జీపీవోల నియామకం

బోథ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని ఆరు క్లస్టర్లలో గ్రామ పంచాయతీ పాలనా అధికారుల నియామకం జరిగింది. ఆరు క్లస్టర్లలో జీపీవోలను ఈ సందర్భంగా నియమించారు. వీరు గ్రామస్థాయిలో రెవెన్యూపరంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి గ్రామాలలోకి వెళ్లి విచారణ చేపట్టి అధికారులకు నివేదిక అందివ్వడం జరుగుతుంది.

కేర్ టేకర్‌గా దరఖాస్తుల ఆహ్వానం

బోథ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో కేర్ టేకర్‌గా పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఎవరైనా పని చేసేందుకు ఈనెల 30 వరకు ఎంఈఓ కార్యాలయంలో దరఖస్తులు అందజేయాలని మండల విద్యాధికారి మహమ్మద్ హూస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు డిగ్రీతో పాటు డీఎడ్ లేదా బీఎడ్ తప్పనిసరిగా చదివి ఉండాలని పేర్కొన్నారు.



తలమడుగు నుంచి కొత్తూరుకు తరలివెళ్తున్న భక్తుల పాదయాత్రలో అమ్మవారి వేషధారణలో చిన్నారులు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- జిల్లాలో 7వ రోజు దుర్గమ్మకు భక్తుల విశేష పూజలు
- పలుచోట్ల సామూహిక కుంకుమార్చనలు

7వ



పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

భక్తిశ్రద్ధలతో భక్తుల పాదయాత్ర

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జిల్లాకేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాతా ఆలయం నుంచి దుర్గానగర్ శ్రీనవశక్తి దుర్గామాత ఆలయం వరకు ఆదివారం సాయంత్రం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు అందించి కన్యకా పరమేశ్వరి దేవిని కొలిచారు. అనంతరం జైమాతాది నినాదాల నడుమ పాదయాత్రను ప్రారంభించారు. జైభవానీ, జైమాతాది నినాదాలతో హోరెత్తించారు. ఉపవాస దీక్షలు తీసుకున్న పలువురు పాదరక్షలు లేకుండా కాలినడకన అమ్మవారి ఆశీర్వాదం కోసం పయనమయ్యారు. దారి పొడవునా దేవి నామస్మరణ చేయడంతో పుర వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు పండ్లు, మంచినీళ్ల పంపిణీ చేశారు. అనంతరం శ్రీనవశక్తి దుర్గామాత ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

ఉట్నూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల రిజర్వేషన్లు ప్రకటించిన అధికారులు ఆదివారం సర్పంచ్‌ల రిజర్వేషన్లు సైతం ప్రకటించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు. అదేవిధంగా మత్తడిగూడ, నర్సాపూర్(బి), నర్సాపూర్(జె), షకీరా(బి), సాలెవాడ(బి), సాలెవాడ(కె), షాంపూర్, వడగల్పూర్(కె), ఏందా, చెరువుగూడ, చింతకర్ర, దొంగచింత, గంగాపూర్, ఘన్పూర్, హీరాపూర్(జే), జైత్రామ్‌తండా, కామాయిపేట్, కుమ్మరితండా, మారుగూడ గ్రామ పంచాయతీలు ఎస్టీ జనరల్‌గా ప్రకటించారు. ఇదేకాకుండా బాబాపూర్, బీర్సాయిపేట, చాందూరి, దంతనపల్లి, గోండుగూడ(జి), హస్నాపూర్, కన్నాపూర్, లక్కారం, లక్షెటిపేట, నడ్డంగూడ, నాగాపూర్, పులిమడుగు, సాకెర (జె), శ్యామ్‌నాయక్‌తండా, టక్కుగూడ, తాండ్ర, ఉమ్రి, లింగోజితండా ఎక్స్‌రోడ్, గ్రామ పంచాయతీలను ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

బోథ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ మా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, గత ప్రభుత్వం పేదలను విస్మరించిందని పేర్కొన్నారు. ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ సట్ల ఉమేష్, తదితరులున్నారు.

రిజర్వేషన్‌లను మార్చాలి : లైవ్

నేరడిగొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వలననే మండలంలో సావర్గం, పిచర, ఆరేపల్లి గ్రామ పంచాయతీలకు బీసీ రిజర్వేషన్ వచ్చిందని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి బీసీ రిజర్వేషన్ పొంది పోటీ చేయడానికి బీసీ వర్గానికి చెందిన వ్యక్తులు లేకున్నా బీసీ ఎలా ఇచ్చారని అన్నారు. వందశాతం ఎస్టీలు చిన్నబుగ్గారంలో ఉన్నారని అధికారులు నివేదికలు పంపారు. కానీ అక్కడ బీసీలు కూడా ఉన్నారు. అధికారులు ఎలా వంద శాతం ఎస్టీలు ఉన్నారని ఎలా నివేదికలు తయారు చేసారని సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్టీలు ఉన్న గ్రామానికి బీసీల రిజర్వేషన్ ఎలా కేటాయించారో అధికారులు తెలపాలన్నారు. అధికారుల తప్పులతోనే మూడు గ్రామ పంచాయతీలకు అన్యా యం జరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్త చేస్తూన్నారన్నారు. ఇందులో లైవ్ నాయకులు శ్రీనివాస్, సుభాష్, ఫుల్ సింగ్, పాండు, తదితరులు పాల్గొన్నారు.



వంకతుమ్మ వాగులో ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న గిరిజనులు

- ఏజెన్సీలోని అటవీ ప్రాంతాల్లో ఐరన్ బ్రిడ్జిలు మంజూరు అయ్యేనా?
- నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జు ముమ్మర ప్రయత్నాలు
- రూ.17.92 కోట్లతో ప్రతిపాదనలు

ఆదివాసీల కష్టాలు.. గట్టెక్కేనా?!



నర్సాపూర్(జె) వాగును సాహసం చేస్తూ దాటుతున్న గిరిజనులు



ఇనుప బ్రిడ్జి చిత్రం

ఉట్నూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో గల గ్రామాలలో అనేక కష్టాలకు గురవుతూ అరణ్య రోధన అనుభవిస్తున్న ఆదివాసీల కష్టాలు వంతెనలు నిర్మాణాలతో గట్టెక్కనున్నాయి. ప్రతియేటా వానాకాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహించి గిరిజన గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి. దీంతో గిరిజనులు పడుతున్న కష్టాలు వర్ణానాతీతం. బాలింతలు ప్రసవ సమయంలో ఆసుపత్రులకు చేరుకోలేక వాగు పరివాహక ప్రాంతాలలో ప్రసవాలు జరిగిన సందర్భాలు కూడా గిరిజనులకు ఎన్నో ఎదుర్కొంటున్నారు. జ్వరాలు వచ్చినా, పాము కాటుకు గురైనా.. క్రూరమృగాలు దాడులు చేసినా.. తక్షణ వైద్య సహాయం అందుకోలేని దుస్థితిలో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా కొట్టుమిట్టాడుతున్నారు. అంతేకాకుండా గత రెండు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజాప్రతినిధులు కొన్ని గ్రామాల వాగులపై వంతెనలు నిర్మించడానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నారు. అయినా అటవీ శాఖ అనుమతులు లేక గిరిజన ప్రాంతాల వాగులపై వంతెనల నిర్మాణాలు ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి పోతున్నాయి.

అందుబాటులోకి రవాణా సౌకర్యాలు

ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలకు వెళ్లేదారులలో ఉన్న వాగులపైన ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషితో మంజూరు అవుతాయా? అన్న అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. వాగులపై ఇనుప వంతెనలు నిర్మించడం ద్వారా గిరిజనులకు కనీస రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పలువురు భావిస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని మండలంలో నిర్మించిన ఇనప వంతెనలను పరిశీలించడంతో పాటు నియోజక వర్గానికి చెందిన కొంత మంది అటవీ శాఖ అధికారులను సైతం తమ వెంట తీసుకువెళ్లి చూపించారు. ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ నుంచి వంకతుమ్మవెళ్లే దారిలో ఉన్న వాగుపైన, దంతన్‌పల్లి నుంచి నరసాపూర్(జె) వెళ్లే వాగుపైన, పెంబి మండలంలో ఇటిక్యాల, దొందరి మధ్యవాగు పైన ఒకటి, రెండు, మూడు చోట్ల, అలాగే ఇదే మండలంలోని యాపల్‌గూడ, రామ్‌నగర్‌ల మధ్య ఉన్న వాగుపైన ఇనుప వంతెనలు నిర్మిస్తే

(తరువాయి 6వ పేజీలో....)

అడవి బిడ్డల కష్టాలు తెలుసు

: వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్



ఆదివాసీ గోండు గిరిజనుడు అయిన తనకు అడవి బిడ్డల కష్టాలు బాగా తెలుసు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. గిరిజన గ్రామాల ప్రజలకు సరైన రహదారులు లేక, రవాణా సౌకర్యాలు లేక అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణ సహకారం ఉన్నందున మంత్రులు, ఉన్నతాధికారులు సైతం తన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతారని ఆశిస్తున్నారు. ఐరన్ బ్రిడ్జిల నిర్మాణంతో నా ఆశయం తప్పక నెరవేరుతుంది.

కన్నుల పండువగా బతుకమ్మ సంబురాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బతుకమ్మ సంబురాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బతుకమ్మ గౌరమ్మల వద్ద పూజలు చేసిన అనంతరం పాటలకు తగ్గట్లుగా కోలాటాలు ఆడుతూ సందడిగా గడిపా రు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



టెంబి గ్రామంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

ఆదిలాబాద్ టౌన్: బేల మండలంలోని మసాల(బీ) గ్రామంలో జరిగిన బతుకమ్మ సంబరాలలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహ పరిచారు. అంతకుముందు గ్రామానికి చెందిన పలు సమస్యలపై చర్చించారు. ఏ సమస్య వచ్చినా గ్రామస్థులకు తాను అండగా ఉంటానని కంది శ్రీనివాస రెడ్డి ఈ సందర్భంగా భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, డైరెక్టర్ మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామా రూపేష్ రెడ్డి, రాక్రె అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఘన్ శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

● మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో

బజార్‌హత్నూర్: మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవ సంబరాలను ఆదివారం టెంబి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొనగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు గాడేకర్ పరశురాం మాంగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు జాదవ్ గణేష్, మాధవ్, సూరజ్, గజానంద్, వినోద్, జ్ఞానేశ్వర్‌లతో పాటుగా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● రేపు ఉట్నూర్‌లో నిమజ్జనోత్సవం

ఉట్నూర్: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్‌లో దుర్గాదేవి, బతుకమ్మల నిమజ్జన సామూహిక శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుగులోతు శ్రీరామ్‌నాయక్, సాడిగే రాజేశ్వర్‌లు తెలిపారు. వినాయక చౌక్‌లో జ్యోతి ప్రజ్వలన అనంతరం సభ నిర్వహించారు. వినాయకచౌక్‌లో ముఖ్యఅతిథులు జెండా ఊపి బతుకమ్మలు, దుర్గాదేవి శోభాయాత్ర ప్రారంభిస్తారన్నారు. శోభయాత్ర వినాయకచౌక్ నుంచి శివాజిచౌక్, వివేకానంద చౌక్, అంబేద్కర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్‌ల మీదుగా శోభయాత్ర గంగన్నపేట చెరువు వరకు సాగుతుందన్నారు. విజయదశమి పండుగ అక్టోబరు 2న నిర్వహిస్తామన్నారు.



ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో కోలాటాలు ఆడుతున్న కలెక్టర్ రాజర్షి షా, జిల్లా అధికారులు

భగత్‌సింగ్ స్ఫూర్తిగా ముందుకు సాగాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఉరి కంబాన్ని ముద్దడిన భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుంటు ఆయా రంగాల్లో రాణించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం భుక్తాపూర్‌లోని పార్టీ కార్యలయంలో భగత్ సింగ్ 118 వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దేశం కోసం ఆయన చేసిన త్యాగలు, పోరాటలను మననం చేసుకుంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుంటాల రాములు, మహెబుబ్ ఖాన్, అర్గంకి రమేష్, ఎస్.అరుణ్ కుమార్, తబ్రేజ్ ఖాన్, బెజ్జంకి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు భజనరంగ్ దళ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంశర్మ, శ్రీకాంత్, సుధాకర్, త్రిశూల్ సింగ్, సంతోష్ సింగ్ ఠాకూర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: భగత్ సింగ్ దేశభక్తి వెలకట్ట లేమని ఆయన ఆశయ సాధన కోసం యువతతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో ఇటీవల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇందులో ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్‌తో పాటు సహకార సంఘం డైరెక్టర్ చట్ల ఉమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బోథ్‌లో నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం



సోనాలలో జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

బోథ్: సోనాల మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌక్‌లో ఆదివారం భగత్ సింగ్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటం పూలమాలలు వేసి ఆయన దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప యోధుడని పలువురు పేర్కొన్నారు. అంతేగాక ఆయన ఉరి శిక్షణ సైతం లెక్కచేయకుండా ధైర్యంగా ఉరి కంభం ఎక్కిన గొప్ప యోధుడు అని పేర్కొన్నారు. ఇందులో యువకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గరీబోళ్ల పార్టీ అని, పేదల సంక్షేమం కోసమే పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని డాల్డా కంపెనీ కాలనీలో రఫీక్, సలీం ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్ శ్రేణులు, కాలనీ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభత్వం మన రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పని చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తూ పేదల సొంతింటి కల తీరిస్తే ఎమ్మెల్యే పాయల్ శంకర్ అవి బీజేపీ ఇస్తున్నట్లుగా చెప్పకుంటున్నారని అన్నారు. ఇందులో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఇమ్రాన్, ఖిజర్ పాషా, గిమ్మ సంతోష్ రావు, కోలా నరసింహులు, లోక ప్రవీణ్ రెడ్డి, ప్రశాంత్, తదితరులున్నారు.

మట్టిదారుల్లో న(డ)రక యాతనే..!

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లే మట్టి దారులన్నీ వర్షాలకు బురదమయంగా మారి వ్యవసాయ రైతులకు ఇబ్బందిగా తయారయ్యాయి. రైతులు కాలినడకన కూడా వెళ్లడం కష్టంగా మారింది. కాలు తీసి కాలు వేయరాకుండా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే రైతులు, కూలీలు జంకుతున్నారు. వ్యవసాయ పనులతో పాటు, ఎరువుల బస్తాలు తీసుకెళదామన్నా కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. కాగా మండలంలోని పిప్పిరి గ్రామ శివారులో మట్టి బాటలో ఆదివారం ఎడ్ల బండి బురదలో కూరకుపోవడంతో అతికష్టం మీద బయటకు తీశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే మట్టి దారులపై కనీసం మొరం వేసి బాగు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



బజార్‌హత్నూర్ నుంచి మట్టిరోడ్డు వెంబడి కూలి పనికి వెళ్తున్న మహిళలు

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్

ఉట్నూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన కృష్ణపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరిగిందని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మనవి ప్రసాద్ తెలిపారు. ఆయనను హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులను మోసం చేసిన వ్యక్తిపై ఇదివరకే 25 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. సీఐ మడావి ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంద్రవెల్లి మండలం శంకర్ గూడపు చెందిన శేషరావు కుమారుడు జవాడే కృష్ణ అన్నారు. నిందితుడు కృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా ఎస్‌కే డిజిటల్ మైక్రో ఫైనాన్స్ ఆఫీసులు అదిలాబాద్ , ఉట్నూర్‌లో తెరిచి అందులో ఉద్యోగాలు ఇస్తానని సుమారుగా 300 మందికి పైగా నిరుద్యోగులనుంచి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు వంతున, ఇతర ఉద్యోగాల పేరిట కూడా డబ్బులు వసూలు చేసుకుని, వారికి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేయగా, అతనిపై ఆదిలాబాద్ , కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలలో 25 కేసులు నమోదు అయినవన్నారు.ఇతనిపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్శి షా పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేయడం తో అతనికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందించి, అతనిని చెర్ల పల్లి జైలుకు తరలించడం జరిగినదన్నారు.ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



● కృష్ణకు పీడీ యాక్టు ఉత్తర్వులు అందిస్తున్న సీఐ మడావి ప్రసాద్

యాదిలో..

బతుకమ్మ పండుగ.. ప్రకృతి పండుగ



బతుకమ్మ పండుగ అంటే ప్రకృతిని దైవంగా భావించి పూజించడమే. పూలతో పేర్చిన బతుకమ్మలను దైవంగా కొలిచే సంస్కృతి విశిష్టత ప్రతి ఒక్కరికి తెలియాలి. భావి తరానికి సంస్కృతి, సంప్రదయాల ప్రాధాన్యతను తెలియచెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. వేడుకల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొనడంతోపాటు చూసినా సందడి వాతావరణం కనిపిస్తుండడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

- ఈ.సంధ్య రాణి, ఏవో, ఎస్‌టీఎల్, ఆదిలాబాద్

సంస్కృతి, సంప్రాదాయాలకు ప్రతీక బతుకమ్మ



తెలంగాణ సంస్కృతి, సంప్రాదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుంది. ఆడపడుచులు గొప్పగా జరుపుకునే పూల పండుగ ఇది. తొమ్మిది రోజులపాటు వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మను తయారు చేస్తాం. గౌరీ దేవతను పూజించడం ఎంతో అదృష్టంగా బావిస్తాం. మహిళలు ఆడూతూ పాడుతూ వేడుకలను సంబురంగా నిర్వహించుకుంటాం. ఏటా పండుగా ఎప్పుడు వస్తుందా? అని గంపెడు ఆశలతో ఎదురుచూస్తాం.

- ఆదే విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్, నేరడిగొండ

దూరప్రాంతాల్లో ఉన్నా.. వేడుకల్లో పాల్గొంటా..



బతుకమ్మ పండగ అంటే ఎంతో ఇష్టంగా జరుపుకొంటాం. పండగకు అమ్మమ్మ వాళ్లంటికి వెళ్లినప్పుడు పూల కోసం స్నేహితులతో కలిసి పూలకోసం వెళ్లడం ఆనందంగా అనిపిస్తుంది. చదువుల రీత్యా దూరప్రాంతాల్లో ఉంటున్నప్పటికీ బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటా. అంతేకాకుండా బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆటపాటలతో నిర్వహించడం ఎంతో ఇష్టం. బతుకమ్మ మన తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను వివరిస్తుంది.

- కుంబాజి చక్రిక, యువతి, నేరడిగొండ





బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం దిశగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఇచ్చోడ మండలంలోని ముఖ్రా బి గ్రామ పంచాయతీ పరిధిలో గల రఘు గూడ, మంకుగూడ గ్రామానికి చెందిన సోమ్ రావ్, పరమేష్, శేఖర్, భీంరావ్, సురేష్, రవి, గంగారాం, జంగు బాపులతో పాటు పలువురు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని తెలుసుకొని వారి వెంటే నడవాలని నిర్ణయించుకున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గులాబీ జెండా విజయం దిశగా అడుగులు వేస్తున్నామని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసి కేసీఆర్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత ప్రజలు తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, శేఖర్, తదితరులు ఉన్నారు.

ఆదివాసీ ధర్మ యుద్ధం భారీ బహిరంగ సభలో పాల్గొన్న సోయం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో తొమ్మిది తెగల ఆదివాసీ ధర్మ యుద్ధం భారీ బహిరంగ సభ ఆదివారం నిర్వహించగా.. సభకు ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా సభ వేదికపై ఉన్న మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి ఆదివాసులు భారీగా తరలి రావడంతో సభ స్థలం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు మాట్లాడుతూ.. తమకు సుప్రీం కోర్టు మీద భరోసా ఉందని ఆదివాసీలకు అనుకునంగా తీర్పు వస్తుందన్నారు. రాబోయే కొన్ని రోజుల్లోనే లంబాడ సుంగలి సోదరులు ఎస్టీ జాబితా నుంచి తొలిగిపోవాల్సిందేనని అన్నారు. రాజ్యాంగం ప్రకారం లంబాడిలు ఎస్టీలు కాదని, తొమ్మిది తెగల ఆదివాసిలకు దక్కాల్సిన రిజర్వేషన్‌ను వారు తీసుకుంటూ అమాయక ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తాము రాజ్ గోండ్ సేవ సమితి తరఫున రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ధర్నాలు, ర్యాలీలు, సభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గంగనీళ్ల జాతరకు తరలిన భక్తులు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగామలో ఆదివారం గంగనీళ్ల జాతర కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో కేసు వారి కుటుంబ భక్తులు, గ్రామస్థులు శనివారం పోచమ్మ ఆభరణాలతో సోన్ గంగకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం సోన్ గంగాలో ఆభరణాలు శుద్ధి చేసి పూజలు చేసి తిరుగుముఖంగా ఇచ్చోడా మీదుగా అదేగామా, పిప్పిరి, గిర్నూర్ గ్రామల్లో అమ్మవారిని ఊరేగింపుగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దేగామలోని ఆలయానికి చేరుకొని తల్లికి ఆభరణాలు అలంకరించారు.

బోథ్: బోథ్ మండలంలోని కౌటాబి గ్రామంలో నుండి ఆదివారం ఉదయం ముదిరాజ్ సంఘం సభ్యులు అడెల్లి పోచమ్మ గంగానీళ్ల జాతరకు తరలి వెళ్లారు. గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి జాతరకు తరలి వెళ్లడం జరిగింది.

అలాగే, సోనాల మండలంలోని పార్డీ(కే) గ్రామంలో ఆదివారం గంగ నీళ్ల జాతర పురస్కరించుకొని మహిళలు గ్రామ దేవత పోచమ్మకు బోనాలు సమర్పించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి పోచమ్మ గంగ నీళ్ల జాతర సందర్భంగా ప్రతి సంవత్సరం బోనాలు సమర్పించడం గ్రామంలో అన వాయితిగా వస్తుంది. ఆదివారం ఉదయం మహిళలు పిల్లాపాపలతో కలిసి వెళ్లి బోనాల సమర్పించారు.



పార్డీ(కే) గ్రామంలో బోనాలతో తరలి వెళ్తున్న మహిళలు



బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేస్తున్న చైర్మన్

వంజరి కులస్తుల ఐక్యత కోసం కృషి

● ఉమ్మడి జిల్లా వంజరి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో సొసైటీ చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వంజరి కులస్తుల ఐక్యత కోసం కృషి చేస్తున్నామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక కాగ్నే ఫంక్షన్ హాల్‌లో గ్రామ పటేల్ డోంగ్రే మారుతి పటేల్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వంజరి కులస్తుల కుల గురువు సంత్ భగవాన్ బాబా, దివంగత మాజీ మంత్రి గోపినాథ్ ముండే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ముండే దీపక్, రామ్ చందర్, రవీందర్ ముండే, ముస్లే సుభాష్, వెంకట్ రావ్, తదితరులు ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేసి సమాజ అభివృద్ధికి పాటు పడుదామన్నారు. ఇందులో గిత్తే మారుతి మహరాజ్, కేంద్రే బాలాజీ, ముస్లే కేశవ్ పటేల్, పడ్ విశ్వనాథ్, పడ్ వరుణ్ పటేల్, ముండే సాయినాథ్, తదితరులున్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అత్యసవర సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారి కోసం తమ వంతుగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని ఇస్మాయిలి సివిక్ అఘాఖాన్ హెల్త్ కమిటీ కన్వీనర్ అమిన్ రజనీ అన్నారు. ఆదివారం ఇస్మాయిలి సివిక్, ఇస్మాయిలీ కౌన్సిల్ అఘాఖాన్ హెల్త్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఖోజా కాలనీలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందిస్తు పండ్ల రసం అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ నాయకులు అజీమ్ ఇరాని, ముకే సాహెబ్, అమిల్ అలీ ఇరానీ, నసీరుద్దిన్ రజానీ, కరీం రజానీ, అన్వర్ అలీ అజానీ, కరీంఅలీ నూరని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్, అన్వర్‌అలీ, తదితరులున్నారు.

ప్రజలకు పథకాలు అందేలా చూడాలి

మావల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవో ఆకుల భూమయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఐకే రెడ్డితో కలిసి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం తలమడుగు మండలం ఉండం గ్రామంలోని ఆయుష గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఎంపీడీవో ఆకుల భూమయ్యను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో భూమయ్య ఎంతో సౌమ్యులుగా ఉంటూ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతాయితంగా పనిచేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎక్కడ పనిచేసిన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడడంతో పాటు గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారి సేవలు ఎంతో గొప్పవని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మావల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, మాజి కోఆప్షన్ మెంబర్ రహీం ఖాన్, రెండ్ల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల కష్టాలు.. గట్టెక్కేనా?!

(5వ పేజీ తరువాయి...)

గిరిజనులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

ఎమ్మెల్యే ముమ్మర ప్రయత్నాలు

1978లో ఏర్పడిన ఖానాపూర్ గిరిజన నియోజక వర్గానికి ఎంతో మంది ఎమ్మెల్యేలు ఎన్నికైనప్పటికీ.. రెండేళ్ల క్రితం ఎన్నికైన ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మారుమూల గిరిజన గ్రామాలలో వాగులపై వంతెనలు నిర్మించడానికి తన వంతుగా కృషి చేస్తున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల గ్రామాలకు ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నా.. అటవీ శాఖ అనుమతులు లభించక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని భావించిన ఎమ్మెల్యే సిమెంట్ కట్టడాలకు అనుమతులు దొరకడం లేదని భావించి ఇనుప వంతెనల నిర్మాణంతో గిరిజనులకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మంత్రులను కలవడంతో పాటు ఉన్నత అధికారులను సైతం కలిసి గిరిజనులు పడుతున్నకష్టాలు వివరిస్తున్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాలలో ఉన్న వాగులపై ఆరు ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.17.92 కోట్లతో అంచనాలు తయారు చేయించి ప్రతిపాదనలను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో గిరిజనుల కష్టాలు తెలిసిన మంత్రి సీతక్క సైతం నిధులు మంజూరు చేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. దీంతో అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణలను సైతం కలిసి విన్నవించారు.

ఘనంగా దుర్గామాత పాదపూజ అభిషేకం

బోథ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం దుర్గా మాత మండపం వద్ద పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారవేత్తలు కత్తూరి విశ్వనాథ్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం పాదపూజను శాస్త్రయుక్తంగా చేపట్టారు. కార్యాక్రమానికి 800 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, ఆర్కెస్ట్రా, భక్త బృందం వారు పాడిన పాటలు అలరించాయి.

17వ రోజుకు నిరవధిక సమ్మె

ఉట్నూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు దినసరి ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తలపెట్టిన నిరవధిక సమ్మె ఆదివారంకు 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు ఎరుకొండ రాజన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ పట్టణ కార్యవర్గం ఏర్పాటు

బోథ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు భోజన్న, గౌరవ అధ్యక్షులుగా గంగుల మల్లేష్, కార్యదర్శిగా మాసం అనిల్, అడ్వైజర్‌గా అడెపు హరీష్, ఉపాధ్యక్షులుగా జక్కుల వెంకటేష్, సామల లక్ష్మీనారాయణ , కిరణ్, సగం నరసింహ, దాస్, దీకొండ వెంకట నరసయ్య, భారతాల గోవర్ధన్, తడకపోశెట్టి, కొండ స్వామి, సిరిపురం రాజశేఖర్, వడ్లకొండ శ్రీనివాస్, పిండం మల్లేష్, సల్ల రవి, భూసరము తాటికొండ రాజేశ్వర్, భైరి రవీలను ఎన్నుకోవడం జరిగింది. సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.



బుద్ధవందన కార్యక్రమంలో పాల్గొన్న బౌద్ధ బాంధవులు

బుద్ధ విహార్‌లో బుద్ధ వందనం

భైంసా, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని నర్సింహనగర్ ప్రాంతంలో గల బుద్ధవిహార్‌లో ఆదివారం బుద్ధవందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బౌద్ధ బాంధవులు బుద్ధవందనకు భారీసంఖ్యలో హాజరయ్యారు. స్థానిక బుద్ధ విహార్ టీం ఆధ్వర్యంలో బౌద్ధ బాంధవులు సాముహికంగా త్రీసరణా - పంచశీల పఠించారు. శ్రామినార్ పాండురంగ్ జాదవ్, బుద్ధవిహార్ టీం ప్రతినిధులు ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు.

గెలుపొందిన జట్లకు నగదు అందజేత

తానూర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా మండలంలోని కోలూర్, గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విన్నర్‌గా నందిపేట్, రన్నర్‌గా అష్ట తృతీయ స్థానంలో పల్సిగా నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.7777. ద్వితీయ నాగేష్, ద్వితీయ బహుమతి రూ.4444 మాధవరావు, తృతీయ బహుమతిగా బాలాజీ రూ.2222 గెలుపొందిన జట్టులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, జ్ఞానేశ్వర్, గణేష్, నాగేష్‌పటేల్, విఠల్, యువకులు, పలు గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

కుంటాలలో చోరీ

కుంటాల, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): కుంటాలలో సక్కరపు సురేష్ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ శనివారం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో నిర్మల్ వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు సురేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే వచ్చి చూడగా 4 గ్రాముల బంగారంతోపాటు రూ.10వేల చోరీకి గురైనట్లు తెలిపారు.

మన్‌కీ బాత్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కడెం, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులడు రితీష్ రాథోడ్ వీక్షించారు. ఆయనతోపాటు కడెం మండల బీజేపీ అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ యాదవ్, మండల నాయకులు మోహన్ నాయక్, శ్రీరామ్, ఎం. కృష్ణ, తిరుమలయ్య, నల్లగొండ, లక్ష్మణ్, రంజిత్, తదితరులు పాల్గొని వీక్షించారు.

గజ్జెలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కుంటాల, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి) : కుంటాలలోని గజ్జెలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భైంసా, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): భైంసా- బాసర రోడ్డు మార్గంలో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ముథోల్‌లోని తరోడాకు చెందిన జి.దేవానంద్(35) భైంసా నుంచి స్వగ్రామానికి బైకుపై వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదు. భైంసా పట్టణ పోలీసులు ప్రమాదస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

» దుర్గామాతకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు

» శివాజీ నగర్‌లో అమ్మవారికి 101 నైవేద్యాల సమర్పణ

ఖానాపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఏడోరోజు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాజీ నగర్‌లో దుర్గమ్మకు 101 రకాల నైవేద్యాలను సమర్పించారు. శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పట్టణంలోని విద్యానగర్, అంబేద్కర్ నగర్ సహా పలు గ్రామాల్లో దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యానగర్ దుర్గామాత మండపం వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నాం సత్యం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విద్యానగర్ బృందం



ఖానాపూర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా భగత్ సింగ్ జయంతి

దేశభక్తి, త్యాగం, వీరత్వానికి ప్రతీకగా నిలిచిన భగత్ సింగ్ జయంతి వేడుకలను జిల్లాలో బీజేపీ, సీపీఎం పార్టీలు, పలు యూత్ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. భగత్ సింగ్ పోరాట పటిమ ఆదర్శనీయం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భగత్ సింగ్ చేసిన త్యాగాన్ని కొనియాడారు.

● న్యూస్ నెట్‌వర్క్



భగత్ సింగ్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



సీపీఎం ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, యూత్ సభ్యులు



తానూర్‌లో భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

» కాంగ్రెస్ ప్రతినిధులతో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా,సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులెవరైనా వారి గెలుపే లక్ష్యంగా పెట్టుకొని కాంగ్రెస్ ప్రతినిధులు ముందుకు సాగాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. తమ ప్రాంతాల్లోని పార్టీ కార్యకర్తలందరినీ స్థానిక సంస్థల ఎన్నికల సంగ్రామానికి కార్యోణ్ముఖులుగా తీర్చిదిద్దాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణలు, పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ప్రతినిధులు, మాజీ సర్పంచులు దత్తురామ్ పాటిల్, మహిపాల్‌రెడ్డి, శంకర్ చౌహన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రతినిధులు

కాలరాత్రి రూపంలో అమ్మవారు

బాసర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసర సరస్వతీ అమ్మవారు ఏడో రోజు కాలరాత్రి అవాతరంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు విజయ్‌సింగ్ అన్నదాన సత్రానికి రూ.లక్ష చెక్కును ఆలయ ఈవో అంజనా దేవికి విరాళంగా అందజేశారు.



కాలరాత్రి అవతారంలో బాసర అమ్మవారు

గ్రూప్-2 ఫలితాల్లో జాడి జ్యోతి ప్రతిభ

కడెం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన జాడి జ్యోతి ప్రతిభ కనబర్చారు. గ్రూప్-2లో మండల పంచాయతీ ఆఫీసర్ గెజిటెడ్ హోదా అధికారిగా ఉద్యోగం సాధించారు.

గ్రూప్-2 ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుడు

లోకేశ్వరం: మండలకేంద్రానికి చెందిన తక్కల శ్రీనివాస్ ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో ఎంపీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. శ్రీనివాస్ ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తితో కొనసాగుతున్నారు. శ్రీనివాస్‌కు గ్రామ ప్రజలు, స్నేహితులు అభినందనలు చేశారు.

లోకమాన్య సహకార సంఘం చైర్మన్‌గా గంగాధర్

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): లోకమాన్య సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ భూసారపు గంగాధర్ ఎన్నికయ్యారు. పట్టణంలోని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జిల్లా పాలకవర్గ సభ్యుల ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఉప్పులూటి రవికుమార్ పర్యవేక్షించారు. నూతన పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. చైర్మన్‌గా భూసారపు గంగాధర్, వైస్‌చైర్మన్‌గా శివరాం వెంకటేష్, జనరల్ సెక్రటరీగా సతీష్, క్యాషియర్‌గా అన్నం వసుదేవరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఇర్రి నరేందర్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్‌గా జటాల శ్రీనివాస్, డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ తుమ్మల ప్రమోద్ చంద్రారెడ్డి హాజరయ్యారు. వక్తగా సహకార భారతి తెలంగాణ రాష్ట్ర క్రెడిట్ సెల్ ప్రముఖ్ ఆవుల బాబు చంద్ హాజరై ప్రసంగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): మోసాల పట్ల గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో కుంటాల పోలీసులు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అవసరమైతే యువకులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, పోలీసులకు తమకు సహకరించాలని కోరారు.

గుండంపల్లిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లి గురుడెరెడ్డి సంఘం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కాళికా అవతారంతో దర్శనమిచ్చిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు మంగళహారతులతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా కుంకుమార్చన

కుంటాల, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబా(బీ)లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో దుర్గామాత వద్ద కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బతుకమ్మ వచ్చిందంటే నూతనోత్సాహం

శోభ శ్యాంసుందర్, నిర్మల్ జిల్లా

బతుకమ్మ సంబరాల కోసం ఎదురు చూపులు చూసే వాళ్లం. వేడుకల వచ్చాయంటే నూతనోత్తేజం వెల్లివిరిసేది. అంతటా సంబురం నెలకొనేది. తొమ్మిది రోజుల రోజుల పాటు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకునే వాళ్లం. ఎన్ని పనులున్నా సాయంత్రం వేళ వాటన్నింటిని పక్కన పెట్టి బతుకమ్మ ఆటలాడే వాళ్లం. మహిళలందరూ తమ ఇళ్ల వద్ద గల పూలను, తిను బండరాలను తీసుకవచ్చి బతుకమ్మ ఆడేవాళ్లం.



పుట్టినింటి బతుకమ్మ

పోడేటి లక్ష్మీ, నర్సాపూర్

బతుకమ్మ పండుగ మా ఇంటా కొత్త సందడిని తెచ్చింది. నర్సాపూర్ కేజీబీవీ పాఠశాలలో సోషల్ టీచర్‌గా ఉద్యోగ జీవితం నుంచి విరామం తీసుకుని పండుగ సందర్భంగా ఇంటికి చేరుకోవడంతో కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పండుగ మొదలైన నాటి నుంచి నేను, నా కూతురుతో కలిసి శ్రద్ధగా పూలను సేకరించి, బతుకమ్మను పేర్చడంలో నిమగ్నమయ్యాం.



ఇప్పటికీ అమ్మవారింటికి వెళ్తాను...

- నవత్ లక్ష్మీ, కొండాపూర్, నిర్మల్ రూరల్

మా చిన్నప్పటి రోజుల్లో బతుకమ్మ పండుగ వస్తుందంటే పెత్తర మాస ఉదయాన్నే లేచి చకచక పనులు ముగించుకొని బుట్టలు పట్టుకొని ఇళ్లిళ్లు తిరిగి పూలు తీసుకువచ్చి బతుకమ్మని చక్కగా పేర్చి చిన్న డబ్బాల్లో ప్రసాదాలను పెట్టుకునే వాళ్లం. పూలతో తయారు చేసుకున్న బతుకమ్మను తీసు కొని వీధుల్లోని బతుకమ్మ బావి వద్దకు వెళ్లే వాళ్లం. బతుకమ్మ బావి చుట్టూ కల్లాపి చల్లి ముగ్గులు వేసి, గద్దెలపై బతుకమ్మని పెట్టి ఆడే వాళ్లం





ప్రతిభా పురస్కారాలు అందుకున్న జిల్లా కవులు

జిల్లా కవులకు జాతీయ పురస్కారాలు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కవులకు సాహితీ కిరీటి ప్రతిభా జాతీయ పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం, ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక వారి 155వ సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో కళా వేదిక మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖుల చేతుల మీదుగా జిల్లాకు చెందిన ప్రముఖ కవులు పత్తి శివప్రసాద్, తుమ్మల దేవరావు, అంబటి నారాయణ, బి. వెంకట్, జాదవ్ పుండలీక్ రావు పాటిల్, సాహి తీ కిరీటి ప్రతిభా జాతీయ పురస్కారాలను అందుకున్నారు. యువ సాహితీ కిరీటి పురస్కారాన్ని పోలీస్ భీమేష్ ప్రత్యేకంగా అందుకున్నారు. ఈ సందర్భంగా కవులకు జ్ఞాపిక, శాలువా, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

పురస్కారం అందుకున్న జాదవ్ పుండలీక్



పురస్కారాన్ని అందుకున్న కవి జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసా ప్రాంతానికి చెందిన హంసావాహిని సాహిత్య కళా పీఠం అధ్యక్షులు, కవి, రచయిత జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్ ఆదివారం సాహితి కిరీటి పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన తెలుగు సాహితీ పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో జాదవ్ పుండలిక్‌రావ్ పాటిల్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సాహితీ కిరీటి పురస్కారాన్ని అందుకున్న కవి జాధవ్ పుండలిక్‌రావ్‌ను భైంసా, ముథోల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కదం మోహన్‌రావ్ పాటిల్, భోస్లే నందకిషోర్ పాటిల్, ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు ఆశమొల్ల మోహన్, ముథోల్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. అనిల్ కుమార్ జాధవ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చందులాల్‌తో పాటు పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కప్పర్లలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



దేవీ వద్ద పూజలు చేసిన కలెక్టర్ రాజర్షి షా



ఉట్నూర్‌లో గంగపుత్రుల బోనాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను మహిళలు భక్తిశ్రద్ధల నడుమ జరుపుకుంటున్నారు. ఆయా మండపాల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని బొజ్జవార్ ఆలయంలో నవ కన్య పూజ నిర్వహించారు. చిన్నారులందరి కాళ్లుకడిగి, కాళ్లకు పసుపు, పారాణితో అలంకరించారు. పట్టు వస్త్రాలు, అలంకార, సౌభాగ్య ద్రవ్యాలు అందజేసిన అనంతరం పాయసం, తీపి పదార్థాలు తినిపించారు.

ఘనంగా కుంకుమార్చన

తాంసి: దుర్గా శారద దేవి మండపాల వద్ద కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ఈ కుంకుమార్చన ఏడు గంటల వరకు కొనసాగింది. కప్పర్ల, హస్నాపూర్, వడ్డాడి, పొన్నారి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. హస్నాపూర్ గ్రామంలో శారదా దేవి మండపం వద్ద గాజుల పండుగను ఏర్పాటు చేశారు. పండితుల వేదమంత్రాలు మహిళల పూజలతో దేవీ మండపాలు సందడిగా కనిపించాయి.

మహా పాదయాత్ర

తలమడుగు: మండలం కేంద్రం నుంచి కొత్తూరు వరకు ఆదిపరాశక్తి కొత్తూరు దుర్గామాత ఆలయం వరకు తలమడుగు మండల కేంద్రం వెంకటేశ్వర ఆలయం నుంచి మహిళలు మంగళ హారతుల తో, భాజ బజంత్రీల తో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహా పాదయాత్రను చేపట్టారు.

లక్ష్మీపూర్ బాలాజీనగర్‌లో..

జైనథ్: ఉమ్మడి మండల పరిధిలోని సాత్నాల, బోరజ్, జైనథ్ పరిధిలోని ఆయా గ్రామాల్లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మహాచండి దేవి ప్రతిరూపంలో దుర్గాదేవి అవతారం ఎత్తింది. ఈ సందర్భంగా జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గొడం మనిమాల గంగారాంలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ గార్డెన్, లక్ష్మీపూర్ గ్రామ పెద్దలు గోడంగంగారాం, దేవరెడ్డి, శంకర్, గణేష్ పాల్గొన్నారు.

కలెక్టర్ పూజలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్న వరాత్రులను పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రతిష్ఠించిన కాళికామాత మండపాన్ని కలెక్టర్ రాజర్షి షా దర్శించుకున్నారు. కాళీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలు, హారతులు అందించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాలతో సత్కరించారు.

పోచమ్మ బోనాలు

ఉట్నూర్: మండల కేంద్రంలోని బోయవాడ గంగపుత్ర సంఘం భక్తులు ఘనంగా దుర్గామాత మండపం నుంచి పోచమ్మ ఆలయానికి బోనాలత వెళ్లారు. దుర్గామాతకు బోనాలతో సామూహికంగా తాళ మేళాలతో బయలుదేరి బోనాలు సమర్పించారు. అనంతరం గంగపుత్ర కుల దైవం గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

మహాచండి అవతారంలో దుర్గామాత

నేరడిగొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేరడిగొండ మండలంలో మండలంలో కొనసాగుతున్నాయి. ఆదివారం ఆయా మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.



తలమడుగు నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



దుర్గా వేడుకల్లో బాలాజినగర్ మహిళలు



శివాలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

15 ఏళ్లుగా తిరుపతి తరహాలో బ్రహ్మోత్సవాలు



సోనాల గ్రామం రామాలయంలో కొలువుదీరిన సీతారామ లక్ష్మణులు

బోథ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో 15 సంవత్సరాల కాలంగా బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుతున్నారు. 15 సంవత్సరాల క్రితం అప్పటి స్వర్గీయ తులనా రాయణకు బ్రహ్మోత్సవాల విషయమై ఓ శ్రీనివాస్ ఉపాధ్యాయులు ఇచ్చిన సలహా ప్రకారం అప్పటి అధ్యక్షుడు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 15 సంవత్సరాల క్రితం ప్రారంభించిన బ్రహ్మోత్సవాలు క్రమం తప్పకుండా గత ఏడాది వరకు రామాలయ కమిటీ అధ్యక్షుడు జీవీ రమణ ఆధ్వర్యంలో కొనసాగుతూ వస్తున్నాయి. అయితే గ్రామస్థులంతా కలిసి చందాలు వేసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

● తిరుపతిలో జరిగినట్టుగానే..

గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు రాత్రి పురవీధుల గుండా వెంకటేశ్వరుని పల్లకి ఊరేగిస్తారు. అయితే గ్రామ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరపడం జరుగుతుంది. అయితే బ్రహ్మోత్సవాలను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు వస్తుంటారు. మరోవైపు వెంకటేశ్వర స్వామి కొలువుదీరి ఉన్న వాహనాన్ని రంగురంగుల పూలతో అలంకరించడంతో పాటు సేవా కార్యక్రమాలను చేద్దాం చేపడుతున్నారు.

● గ్రామమంతా ఆధ్యాత్మికతతోనే..

బ్రహ్మోత్సవాలు నవరాత్రులు కొనసాగుతుండడంతో గ్రామస్తులంతా మద్యం మాంసానికి దూరంగా ఉంటున్నారు. అంతేగాక దుర్గాదేవి భక్తులు భారీ సంఖ్యలో ఉండడంతో దుర్గాదేవి వద్ద రకరకాల కార్యక్రమాలను భక్తులు చేపడుతున్నారు. దీంతో ఈ గ్రామం ఆధ్యాత్మికంగా మారుతున్నది.

● గ్రామస్థుల సహకారం బాగుంది



బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు గ్రామానికి చెందిన వారే దాతలుగా నిలుస్తున్నారు. దాతల సహకారంతో బ్రహ్మాండంగా ఉత్సవాలను జరపడం జరుగుతుంది. ఈ ఏడాది భక్తుల సహకారం ప్రతి ఏడాది తరహాలోనే చేయూతనిస్తున్నారు.

- శ్రీనివాస్, తాత్కాలిక అధ్యక్షుడు

ఆర్‌బీవీఆర్‌ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



మాట్లాడుతున్న కవితారెడ్డి



దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న దృశ్యం



దుబాయిలో బతుకమ్మల నిమజ్జన శోభయాత్ర

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆర్‌బీవీఆర్‌ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ వేడుకలను సంస్కృతి, సంప్రదాయాలు ప్ర తిబింబించేలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల్ ఎమ్మెల్యే ఏ లేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి కవితారెడ్డి హాజరయ్యారు. ముందుగా బతుకమ్మను రంగు రంగుల పూలతో పేర్చి కోలాటాలు వేస్తూ బతుకమ్మ ఆడారు. దీం తో ఫంక్షన్ హాల్ ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే సతీమణి కవితారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సామూహిక జీవన విధానానికి, ప్రజల ఐక్యతకు బతుకమ్మ పండుగ ఒక నిదర్శనమన్నారు. గౌరీ దేవి ఆశీస్సులతో అందరికీ మంచి ఆరోగ్యం స మకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంగం అధ్యక్షుడు నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వడ్డి రాజేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేశ్వర్ రెడ్డి, కోశాధికారి దామోదర్ రెడ్డి, సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు

నర్సాపూర్(జి): దుబాయ్‌లో నివసిస్తున్న నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల వాసులు తమ సంస్కృతిని సజీవంగా ఉంచుతూ బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గల్ఫ్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జీటీఎఫ్ ప్రతినిధులు సట్ల మానసరాజు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఉల్లాసంగా ఆడిపాడారు. ప్రవాసంలో ఉన్నప్పటికీ తమ తెలంగాణ సంస్కృతిని మరువకుండా ఈ పండుగను ఘనంగా జ రుపుకోవడం పట్ల సట్ల మానసరాజు దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలు నిర్మల్ వా సులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చాయని, కొత్త తరానికి పండుగ విశిష్టతను తెలియజేశామ ని నిర్వాహకులు తెలిపారు.

ధూంధాంగా బతుకమ్మ వేడుకలు

భైంసా: దుబాయిలో నివాసముంటున్న తెలుగింటి ఆడపడుచులు అక్కడ బతుకమ్మ వేడుకలను దూందాంగా నిర్వహించుకున్నారు. శనివారం రాత్రి గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో దుబాయిలోని అల్ క్వాసిస్ వుడ్‌లెమ్ పార్క్ స్కూల్ జోన్‌లో బతుకమ్మ సంబరాలు జరిగాయి. వేడుకలకు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అలూరి కృష్ణవేణి, తెలంగాణ ప్రముఖ జానపద కళాకారులు ఆష్టా గంగాధర్, పూజ నాగేశ్వర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుబాయ్‌లోని తెలుగింటి ఆడపడుచులు గౌరమ్మలను తయారు చేసి రంగు రంగుల పూలను పేర్చి బతుకమ్మలను సిద్ధం చేశారు. వాటన్నింటిని స్కూల్ జోన్ వద్ద పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. తెలంగాణ ప్రముఖ జానపద గాయకుడు ఆష్ట గంగాధర్ తన పాటలతో జానపద కళాకారిణి పూజ నాగేశ్వర్ తన నృత్య ప్రదర్శనలతో అక్కడి వారందరినీ ఖైమరింపజేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ తన ఆటపాటలతో వేడుకలకు వన్నె తెచ్చారు.

ప్రవాసి మిత్ర ఆధ్వర్యంలో

నిర్మల్ రూరల్: ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ బార్ దుబాయ్ కోఆర్డినేటర్ అనిల్ మెంగు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతిలను ఘనంగా సన్మానించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటి వద్ద బతుకమ్మ జన జాతర

● మారుమూల ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు



చందాలు రాస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు దసరా పండుగ దగ్గర పడుతుండటం మరోవైపు దుర్గమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మరోవైపు బతుకమ్మల పండగ సీజన్ కావడంతో స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ ఇంటికి చందాల కోసం భారీ సంఖ్యలో మారుమూల ప్రాంతాల నుంచి మహిళా సంఘాల వారు యువకులు తరలివస్తున్నారు. గత వారం రోజుల నుంచి యువజన సంఘాల వారు దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి కార్యక్రమాన్ని నిర్వహణకు సహకారం అందించాలని చందాల కోసం వస్తున్నారు. వచ్చిన వారందరినీ ఎమ్మెల్యే మెప్పించి సముదాయించి శాలువ కప్పి పంపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బతుకమ్మ గ్రూపుల వారు భారీగా తరలివస్తున్నారు. భీంపూర్, తాంసి, బతుకమ్మ గ్రూపుల వారు భారీగా తరలివస్తున్నారు. భీంపూర్, తాంసి, తలమడుగు, గుడి హత్నూర్, సిరికొండ, బోథ్, సోనాల మండలాల నుండి మహిళలు వారి వారి సంఘాల వారితో కలిసి వస్తున్నారు. ఎమ్మెల్యే మాత్రం ఏ మాత్రం ఛీదరించుదరించుకోకుండా పండగల సీజన్ ముగిసేంతవరకు ఎమ్మెల్యే ఇంటి వద్ద జనం జాతర ఉండేవిధంగా ఉందని పరిశీలకులు అంటున్నారు. తన నియోజకవర్గం నుంచే కాకుండా ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి సైతం మహిళ బతుకమ్మ సంఘాలు తరలి వస్తున్నారు. అయినా ఎమ్మెల్యే ఏ మాత్రం తన ఇంటికి వచ్చిన మహిళ సంఘాలకు తనకు తోచినంత నగదు ఇచ్చి పంపుతున్నారు.

జాతీయ క్రీడా పోటీలకు ఇద్దరు ఎంపిక



బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆర్. కృష్ణ

భైంసా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ వూషూ క్రీడా పోటీల్లో సత్తా చాటుకున్న ఇద్దరు జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి వూషూ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ వుషూ క్రీడా పోటీలు జరిగాయి. ఇందులో జిల్లా నుంచి ఆరుగురు ఖేలో ఇండియా వూషూ శిక్షణ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 17ఏళ్ల లోపు బాలికల విభాగంలో భైంసాలోని అనుసూయపవార్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ డి. రాజేశ్వరీ, బాలుర విభాగంలో బాసరలోని నాగభూషణం విద్యాలయానికి చెందిన కృష్ణలు బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి వూషా క్రీడాపోటీలకు ఎంపికయ్యారని ఖేలో ఇండియా వూషూ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు.

గోమాతకు అంత్యక్రియలు

భీంపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుబిడి గ్రామానికి చెందిన జానీ ఆవు (గ్రామ ఆవు) ఆదివారం చనిపోయింది. గ్రామ ఆ వుగా గ్రామస్థులు భావించేవారు. అది మృతి చెందగా గ్రామస్థులు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.



గోమాతకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

నిబంధనలకు విరుద్ధంగా.. ప్రిసైడింగ్ అధికారుల నియామకం

● విరమణ పొందిన, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులకు బాధ్యతలు

● తప్పుల తడకగా నియామక పత్రాల జారీ



2nd ORDINARY ELECTIONS TO GRAM PANCHAYATS, 2025
NIRMAL DISTRICT

ORDER OF APPOINTMENT OF PRESIDING OFFICER

No. : 05/2024-K1 Dated:26.09.20[illegible]

I hereby appoint the Officer specified below as Presiding Officer for elections [illegible] ers and Sarpanch of Gram Panchayats. You are requested to attend the [illegible] as per the Schedule mentioned below. Your actual allotment of Mandal an[illegible] ayat to perform the duties will be intimated later by concerned ADEA / MPDO.

Name and Address of the Presiding Officer	
Employee Code & Name	1336906 - ALLURI MANOHAR REDDY
Designation	School Assistant(Maths)
Office Address	ZPHS NARSAPUR G TM MANDAL NARSAPUR G
Working Mandal	Narsapur G
Mobile Number	9908539075

For Collector & DEA
NIRMAL District

సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయునికి జారీ చేసిన నియామకపు పత్రం

భైంసా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వాహణ కోసం గాను జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం అన్ని విధాలుగా సన్నద్ధమవుతోంది. ఇందులో బాగంగానే జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల పరిధిలో గల 3368 వార్డుల ఎన్నికల నిర్వాహణకు గాను 4,040 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించింది. జిల్లాలోని ఆయా పాఠశాలల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇందు కోసం గాను నియమించారు. వీరందరికి శనివారం నియామకపు ఉత్తర్వులను జారీ చేసారు. సోమవారం డివిజన్ల వారీగా ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వాహణకు శిక్షణను సైతం ఏర్పాటు చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం అవలంభించిన నిర్లక్ష్య దోరణి విధానాల మూలంగా ప్రిసైడింగ్ అధికారుల నియమాకల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. నిబంధనల ప్రకారం విధుల్లోనున్న ఉపాధ్యాయులకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులగా బాధ్యతలు అప్పచెప్పాలి ఉంటుంది. ఇందులో 6 నెలల కాలంలో పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు మినహాయించాల్సి ఉంటుంది. అయితే జిల్లా పంచాయతీ అధికారులు నిబంధనలను కాలరాస్తూ పదవీ విరమణ పొందిన అనేక మంది ఉపాధ్యాయులకు ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతలు అప్పచెబూతు నియామకపు ఉత్తర్వులు జారీ చేసారు. అంతేకాకుండా సస్పెన్షన్‌లోనున్న ఉపాధ్యాయులకు సైతం బాధ్యతలు అప్పచెప్పారంటే జిల్లా పంచాయతీ అధికారుల పనితీరు ఎంతటి నిర్లక్ష్యంగా కొనసాగుతుందో చెప్పకుండానే తెలిసిపోతోంది. ఇక పదోన్నతులు పొంది ఇతర ప్రాంతాలకు వెళ్లిన, బదిలీలు జరిగి కొత్త చోట విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పూర్వపు స్థానపు ఉపాధ్యాయులుగా పెర్కొంటూ అదే పాఠశాల చిరునామపై బాధ్యతలు అప్పచెబుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిసైడింగ్ అధికారుల నియామకపు ప్రక్రియ ఆద్యాంతం లోపభూయిష్టంగా జరిగింది.2019 సంవత్సరములో జరిగిన ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులుగా విధులు నిర్వహించిన వారందరికి ఎలాంటి పరిశీలనలు జరపకుండా నియమించడం మూలంగా సంబంధిత సమస్య ఏర్పడినట్లుగా తెలుస్తోంది.

● సస్పెన్షన్‌లోనున్న ఉపాధ్యాయునికి నియామక ఉత్తర్వులు

నర్సాపూర్ (జి) ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అల్లూరి మనోహర్ రెడ్డి గతేడాది పలు ఆరోపణలపై విద్యాశాఖ సస్పెండ్ చేసింది.ఇప్పటికి ఆయనపై సస్పెన్షన్ వేటు కొనసాగుతోంది. అయితే సంబంధిత ఉపాధ్యాయునికి జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వాహణ కొరకు ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

● ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సైతం

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వాహణ విధులను నిబంధనల ప్రకారం ఆరు నెలలలోపు ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులకు కేటాయించరాదు.అయితే జిల్లా పంచాయతీ అధికారులు ఆరు నెలలోపు పదవీ విరమణ పొందే వారితో పాటు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సైతం ప్రిసైడింగ్ అధికారులుగా నియమించి నియామకపు పత్రాలు జారీ చేశారు.

● నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలను రద్దు చేస్తాం

శ్రీనివాస్, డీపీవో, నిర్మల్

జిల్లాలో కొన్ని చోట్ల ప్రిసైడింగ్ అధికారుల నియామకపు ప్రక్రియలో లోపాలు జరిగాయి. నియామకపు పత్రాల జారీలో పొరపాట్లు చోటు చేసుకున్నాయి. పున పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలన్నింటిని రద్దు చేస్తాం. ఆయా స్థానాల్లో కొత్తవారిని నియమిస్తాం .



భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

ముథోల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరోడా గ్రామంలో దుర్గామాత మండపం వద్ద ఆదివారం కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే చించాల పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద దీపోత్సవం, దుర్గామాత మండపం వద్ద గాజుల కార్యక్రమం నిర్వహించారు. కారేగాం ఎల్లమ్మ ఆలయంలో దేవి నవరాత్రులలో భాగంగా ప్రతీరోజు నిర్వాహకులు అన్నప్రసాద కార్యక్రమం చేపడుతున్నారు.

వీరత్వానికి ప్రతీక శివాజీ

» ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ఛత్రపతి శివాజీకి పూలమాల వేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి ప్రతీకని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పరిమండల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు నమ్మిన సిద్ధాంతాల కోసం నడుం బిగించాలని, లక్ష్యం సాధించాలన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ఎంతగానో ఛత్రపతి పోరాటం చేశాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితీష్, నాయకులు రావుల రాంనాథ్, బాపురెడ్డి, మేడిసెమ్మె రాజు, సరికెల గంగన్న, మాజీ ఉపసర్పంచ్ ధర్మేందర్, సురేష్, నరేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు ఏలేటి చిన్నారెడ్డి, సంతోష్, మార నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ నవీన్, పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: ప్రధాని మోదీ నిర్వహించే మన్‌కీ బాత్ 126వ కార్యక్రమాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వీక్షించారు.



భైంసాలో నవరాత్రి మహోత్సవాలలో భాగంగా స్థానిక ఆర్య వైశ్య మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.11 లక్షల నగదుతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

• భైంసా, ఆంధ్రజ్యోతి

గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

» 400 జీపీలకు రిజర్వేషన్లను ప్రకటించిన అధికారులు

» ఎస్టీలకు 79, ఎస్సీలకు 63, బీసీలకు 155, జనరల్ 103 స్థానాల కేటాయింపు

ఖానాపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికల నిమిత్తం జిల్లాలో అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లాలో 400 గ్రామ పంచాయతీలుగా ఉండగా మండలాల వారీగా రిజర్వేషన్లను ప్రకటించారు. 100శాతం ఎస్టీ జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు 36 ఉండగా ఇందులో 15 స్థానాలు మహిళలకు, 21స్థానాలు జనరల్‌గా కేటాయించారు. ఎస్టీ రిజర్వ్‌స్థానాలు 43 కాగా మహిళలకు 14, జనరల్ 29 స్థానాలను కేటాయించారు. జిల్లాలో ఎస్సీ రిజర్వ్‌స్థానాలు 63గా నిర్ణయించిన అధికారులకు మహిళలకు 27, జనరల్ 36 స్థానాలు కేటాయించారు. బీసీ రిజర్వ్‌స్థానాలు 155గా నిర్ణయించిన అధికారులు మహిళలకు 73స్థానాలు, జనరల్ 82 స్థానాలను కేటాయించారు. అన్‌రిజర్వ్ కోటాలో ఎవరైనా పోటీ చేసేలా జనరల్ స్థానాలను 103 కేటాయించారు. ఈ స్థానాల్లో మహిళలకు 48, జనరల్ 55 స్థానాలను కేటాయించినట్లు జిల్లా అధికార యంత్రాంగం వెల్లడించారు.

'బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక విజయం'

నిర్మల్‌టౌన్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం ఒక చారిత్రాత్మక విజయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం నారాయణ గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సుదీర్ఘ పోరాటకృషి, అలాగే బీసీ సంఘాల దీర్ఘకాలిక ఉద్యమ ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సందర్భంగా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్లు రాజ్యాంగ, చట్ట బద్ధమైనవని అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యంగా రిజర్వేషన్లను వ్యతిరేకించే వర్గాలు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తిగా గౌరవించి, ఈ నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆశలు ఆవిరి

జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఏళ్ల నుంచి ఆ పదవులపై నేతలు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. అన్నిచోట్ల రిజర్వేషన్లు మారిపోవడంతో నేతల వ్యూహాలన్నీ తలకిందులయ్యాయి. జడ్పీ చైర్మన్ పదవిపై చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకుంటూ వచ్చారు. తమ పార్టీల్లో ఈ పదవిని లక్ష్యంగా చేసుకొని కొంతకాలం నుంచి రాజకీయాలు చేస్తున్న నేతలంతా రిజర్వేషన్లను చూసి నిశ్చేష్టులవుతున్నారు. ఇప్పటికే వారంతా ప్రత్యేక వర్గాలను పోషించేందుకు పెద్దమొత్తంలోనే ఖర్చులు కూడా చేస్తున్నట్లు వాపోతున్నారు.



జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఇదే..



» మారిన రిజర్వేషన్లతో నేతల లెక్కలు తారుమారు
» జడ్పీపీఠంపై సీనియర్ నేతల ఆశలు గల్లంతు
» స్థానిక ఎన్నికల్లో ఇక ఆసక్తికర పోటీ
» రిజర్వేషన్లపై ఆందోళనలు

నిర్మల్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లన్నీ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, నియోజకవర్గపరిధిలో వేర్వేరుగా రావడంతో ఆ పదవులపై కన్నేసిన నేతలు ప్రస్తుతం గందరగోళానికి గురవుతున్నారు. ఎంపీపీ రిజర్వేషన్ తమకు అనుకూలంగా వచ్చినా ఎంపీటీసీ రిజర్వేషన్ తమకు వ్యతిరేకంగా రావడంతో వారు అయోమయానికి లోనవుతున్నారు. ఎంపీపీ పదవిని దక్కించుకోవాలంటే ఎంపీటీసీగా గెలవడం తప్పనిసరి. తమ ఎంపీటీసీ నియోజకవర్గ పరిధిలో రిజర్వేషన్ అనుకూలంగా రాకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. అలాగే కీలకమైన జడ్పీచైర్మన్ పదవిపై కన్నేసిన నేతలు తమ జడ్పీటీసీ నియోజకవర్గ పరిధిలో రిజర్వేషన్లు మారిన కారణంగా ప్రస్తుతం తమ రాజకీయ భవిష్యత్‌పై ఆందోళనకు గురవుతున్నారు. ఇలా స్థానిక సంస్థల్లోని అన్నిస్థాయిల నేతలు మారిన రిజర్వేషన్‌లతో సతమతమవుతున్నారంటున్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీలో..

అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ నేతలకు మారిన రిజర్వేషన్ల వ్యవహారం మింగుడు పడడం లేదని అంటున్నారు. తామొకటి తలిస్తే దైవం ఒకటి తలచిందన్న భావనతో ఆయా పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు నిట్టూరుస్తున్నారు. ఈ సారి జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఎలాగైనా కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్‌లపై మల్లగుల్లాలు పడుతోంది. జడ్పీ చైర్‌పర్సన్ పదవిపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మారిన రిజర్వేషన్‌లతో తమ భవిష్యత్ కోసం సమాలోచనల్లో నిమగ్నమవుతున్నారు. జడ్పీ చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్లు ఒకరిద్దరు నేతలకు అనుకూలంగా ఉన్నా జడ్పీటీసీ రిజర్వేషన్‌తో వారి ఆశలు తలకిందులవుతున్నాయి. మొత్తానికి మారిన రిజర్వేషన్‌ల వ్యవహారం అధికార కాంగ్రెస్ పార్టీలో పదవులపై కన్నేసిన నేతలకు ఒకింత అయోమయ వాతావరణాన్ని కల్పిస్తోందని అంటున్నారు.

బీజేపీలోనూ..

మారిన రిజర్వేషన్ల వ్యవహారంతో దూకుడు మీదున్న బీజేపీలో సైతం అయోమయానికి కారణమవుతోంది. ప్రస్తుతం నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి ఎమ్మెల్యేలు నేతృత్వం వహిస్తుండడమే కాకుండా సెంటిమెంట్ బలంగా ఉన్న నేపథ్యంలో బీజేపీ ఈసారి జడ్పీ చైర్మన్ పదవితోపాటు మెజార్టీ ఎంపీపీ పదవులను దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది. దీంతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా మెజార్టీ సర్పంచ్ పదవులను దక్కించుకునేందుకు ఆ పార్టీ చాలా రోజుల నుంచే క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం రిజర్వేషన్లు మారిపోవడంతో ఆ పార్టీ నుంచి జడ్పీ చైర్మన్ పదవితో పాటు ఎంపీపీ పదవులను లక్ష్యంగా చేసుకొని మొదటి నుంచి రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్న నేతలకు ఈ మారిన రిజర్వేషన్‌లు మింగుడు పడడం లేదని అంటున్నారు. ముఖ్యంగా ఆ పార్టీలో జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకునేందు కోసం నలుగురైదుగురు సీనియర్ నేతలు చాలా రోజుల నుంచి సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నారు. కాగా వీరిలో కొందరికి మారిన రిజర్వేషన్లు వ్యతిరేఖంగా ఉండడంతో ఇక ఆ పదవిపై పెట్టుకున్న ఆశలను వదులుకునే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్ అనుకూలంగానే ఉన్నప్పటికీ జడ్పీటీసీ రిజర్వేషన్లు మాత్రం వ్యతిరేకంగా ఉండడంతో ఇక తాము పోటీ చేసే నియోజవర్గంపై అయోమయ పరిస్థితులను వారు ఎదుర్కొంటున్నారు. మొత్తానికి బీజేపీలో కొత్త రిజర్వేషన్‌ల వ్యవహారం నేతల ఆశలపై నీళ్ళు చల్లిందని అంటున్నారు.

తేరుకోని బీఆర్ఎస్..

స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతుండడం, ఇందులో భాగంగానే రిజర్వేషన్‌లు సైతం ఖరారు అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఓటముల నుంచి ఇప్పటివరకు తేరుకోవడం లేదని అంటున్నారు. లోక్‌సభతో పాటు నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లలో బీఆర్ఎస్ పార్టీ ఘోరమైన ఓటమి పొందిన తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ పునర్ నిర్మాణంపై ఆశించిన మేరకు దృష్టి సారించడం లేదని అంటున్నారు. చాలాచోట్ల జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు ఆ పార్టీకి అభ్యర్థుల కొరత కూడా ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు. కొన్నిచోట్ల పార్టీ నేతలు బలంగా ఉన్నా ఇప్పటికే కేడర్ చేజారిపోయిన సంగతి తెలిసిందే. రాజకీయంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఆస్థిత్వానికి స్థానిక ఎన్నికలు ఓ సవాలుగా మారే అవకాశం ఉందని అంటున్నారు.



బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

బాసరను ముంచెత్తిన వరద

» మహారాష్ట్ర నుంచి భారీగా వరద.. పొంగిన గోదావరి
» నది పరివాహక ప్రాంతమంతా జలమయం
» నెలరోజుల వ్యవధిలో రెండోసారి వరద బీభత్సం

బాసర, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ క్షేత్రంలో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ మరోసారి క్షేత్రాన్ని ముంచెత్తి, జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఆలయ పరిసరాలు, పుణ్యస్నాన ఘట్టాలు పూర్తిగా జలమయమయ్యాయి. మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలు, మంజీరా ఉపనది వరద ఉధృతితో గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్షల క్యూసెట్ల నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, ఇన్‌ఫ్లో అంతకంటే ఎక్కువగా ఉండటంతో బ్యాక్‌వాటర్ బాసర క్షేత్రాన్ని చుట్టుముట్టింది. ఆలయ పరిసరాలన్నీ పూర్తిగా నీట మునిగాయి. ప్రైవేటు హోటళ్లు, సత్రాల చుట్టూ నీరు చేరడంతో, అందులో బస చేసిన భక్తులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆలయానికి వెళ్లే రెండు ప్రధాన రహదారులపై మూడు నుంచి ఏకంగా 8 అడుగుల వరకు నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. సుమారు వేయి ఎకరాల పంట మరోసారి నీట మునిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. నెల రోజుల్లోనే ఈస్థాయిలో వరద రావడం ఇది రెండోసారి కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బ్యాక్‌వాటర్ వరదతో నీట మునిగిన పొలాలు

పెర్కపల్లెలో రిజర్వేషన్‌పై ఉద్రిక్తత

దస్తురాబాద్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లెలో స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం ఓటర్లు 554 ఉండగా, అందులో 550 మంది బీసీకి చెందినవారేనని చెప్పారు. ఎస్టీ వర్గానికి నలుగురు ఓటర్లు ఉన్నారని వివరించారు. అయితే ఒక్కరూ లేని ఎస్సీ వర్గానికి సర్పంచ్ స్థానం రిజర్వేషన్ కిందకు రావడంపై అన్యాయమని అన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాలని అన్నారు. ఎస్సై సాయికుమార్ గ్రామస్థులను సముదాయించి తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై ఆందోళన వద్దని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళనను విరమించారు.



రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు



నల్దుర్తిలో బోనాలతో ఊరేగింపుగా మహిళలు

ఘనంగా బోనాల పండుగ

మామడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్దుర్తిలో ఆదివారం పవనసుత యూత్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఊరేగింపుగా మహిళలు బోనాలు ఎత్తుకొని వీధుల గుండా దుర్గామాత నామస్మరణతో డీజే సౌండ్‌లతో నృత్యాలు చేశారు. సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు.

పెద్దూర్‌లో బోనాలు

కడెం: మండలంలోని పెద్దూర్‌లో ఆదివారం గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలు వండుకొని అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించారు.

దుర్గమ్మకు బోనాల సమర్పణ

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో దుర్గాదేవికి బోనాల పండుగ నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మహిళలు బోనాలను ఊరేగింపు తెచ్చి దుర్గాదేవికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులున్నారు.

ఘనంగా చండీ హోమం

దస్తురాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ సిద్ధి ధాత్రి దుర్గా దేవి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రివేళలో దుర్గాదేవి మండపాల వద్ద భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

దేశ రక్షణ కోసం పాటు పడాలి

కుభీర్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతి, సంప్రదాయలతోపాటు దేశ రక్షణ కోసం ప్రతీఒక్కరు పాటు పడాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర గ్రామీణ వికాష్ సహ సంయోజకులు వెంపల్లి ప్రతాప్ అన్నారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ధిఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్ఎస్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. అఖండ భారతదేశం సాధించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు డా. ఎంటాజీ, రాజన్న, రాజారాం, సగ్గం ముత్యం, దత్తాత్రి పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా స్వయం సేవకులు



మాట్లాడుతున్న మండలి ప్రతినిధి సోమయాజులు

భైంసా: సాంఘీక సమైక్యత, సేవా కార్యక్రమాల ద్వారా స్వయం సేవకులు సమాజ మార్పుకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ఆర్ఎస్ఎస్ అఖిల భారత మార్గదర్శక మండలి ప్రతినిధి సోమయాజులు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం భైంసాలోని గణేష్‌నగర్ బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేటి వరకు దేశవ్యాప్తంగా విస్తృతశాఖలతో విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందూత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పని చేస్తుందన్నారు. హిందూవులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని గుర్తుచేశారు. ఇందులో ఆర్ఎస్ జిల్లా సహ సంఘ చాలక్ సాధుల కృష్ణదాస్, ముఖ్య అతిథిగా లోకవార్ సుదర్శన్‌లతో పాటు ఆర్ఎస్ఎస్ శ్రేణులు, బస్తీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మా.. చల్లగా చూడమ్మా..

» వైభవంగా ముగిసిన గంగనీళ్ల జాతర
» పూజలు చేసిన నాయకులు
» సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



భక్తులతో జనసంద్రంగా దిలావర్‌పూర్ వీధులు



ఆభరణాల మూట మోస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): అడెల్లి పోచమ్మా.. చల్లగా చూడమ్మా.. అంటూ భక్తులు అమ్మవారికి నీరాజనం పలికారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లి మహాపోచమ్మ గంగానీళ్ల జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. రెండురోజులపాటు కన్నుల పండువగా సాగిన జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. శనివారం మధ్యాహ్నం పోచమ్మ నగలను అడెల్లి దేవాలయం నుంచి వేలాదిగా భక్తులు కలినడకతో 30కిలో మీటర్ల పాటు గోదావరి నదికి తీసుకెళ్లారు. తిరిగి నగలను దేవాలయానికి తీసుకువచ్చి అమ్మవారిని నగలతో అలంకరించారు. దీంతో జాతర ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ మెదక్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి నాందేడ్ చంద్రపూర్ జిల్లాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. స్థానిక వైద్యసిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చి పోయే భక్తులకు ఎలాంటి ఇబ్బందులలు ఎదుర్కోకుండా ఆలయ చైర్మన్ భోజాగౌడ్, ఆలయ ఈవో రమేష్, వాలంటీర్లను నియమించారు. తాగునీటి ఎద్దడి లేకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. గోదావరి నుంచి అమ్మవారి నగలను శుద్ధి చేసుకొని కలినడకతో వచ్చే సమయంలో గ్రామగ్రామాన మహిళలు మంగళహారతులతో నగలను స్వాగతం పలికారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

అడెల్లిపోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజజీ ఎంపీపీ అట్ల ఫైపాల్‌రెడ్డి, మాజీ రైతుబంధు కోఆర్డినేటర్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్‌లు ఐటటీ చందు శ్రీనివాస్‌రెడ్డి, ఉట్ల రాజేశ్వర్, మాధవ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ్ మహ్మద్, నాయకులు కోర్వ నవీన్‌రెడ్డి, తదితరులు పూజలు చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

ఘనంగా గంగనీళ్ల జాతర

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఆదివారం గంగనీళ్ల జాతరను వైభవంగా నిర్వహించారు. పోచమ్మతల్లి ఆభరణాలకు శనివారం సాయంత్రం కడ్తాల్ గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారు జామున సోన్ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి ఆభరణాలను శుద్ధిచేశారు. అనంతరం పాదయాత్రగా గ్రామానికి చేరుకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా వీడీసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

జాతరకు వేలాదిగా భక్తజనం

దిలావర్‌పూర్: అడెల్లి పోచమ్మకు భక్తులు అడుగడుగునా నీరాజనం పలికారు. శనివారం రాత్రి సాంగ్వి చేరుకున్న పోచమ్మ ఆదివారం తెల్లవారు జామున గోదావరి నదీమ తల్లి చెంతకు చేరింది. గోదావరి జలాలతో పోచమ్మ ఆభరణాలను శుద్ధిచేసిన అనంతరం ఆభరణాల మూటతో వేలాది మంది భక్తులు వెంటవచ్చారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య మల్లాపూర్, కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడెగాం గ్రామాల మీదుగా సారంగాపూర్‌లో ప్రవేశించిన అమ్మవారు తిరిగి తనసన్నిధి అడెల్లికి బయలెల్లింది. సాంగ్వి గంగ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, దిలావర్‌పూర్ వీడీసీ సభ్యులు, హిందూ వాహిని కార్యకర్తలు అమ్మవారిని గ్రామం నుంచి సాగనంపే వరకు వాలింటీర్లుగా సేవలందించి వీడ్కోలు పలికారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అడెల్లి మహా పోచమ్మ నగల మూట మోశారు. దిలావర్‌పూర్‌లో భారీగా భక్తులు ఉన్న దృష్ట్యా మా డెగాం గ్రామం చేరుకొని అమ్మవారి నగల మూట మోశారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల

ఉత్సవాన్ని పర్యవేక్షించిన ఎస్పీ

అడెల్లి గంగనీళ్ల జాతర ముగింపు ఉత్సవాన్ని ఎస్పీ డా.జనకీ షర్మిల పర్యవేక్షించారు. సంప్రదాయం ప్రకారం పోచమ్మ తల్లి ఆభరణాలను ఎత్తుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులలు విధులు నిర్వహించినందుకు పోలీసులను అభినందించారు.

ముగిసిన గంగనీళ్ల జాతర

కుంటాల: అడెల్లి పోచమ్మ నగలను శుద్ధి చేసిన అనంతరం దిలావర్‌పూర్ నుంచి కుంటాల మండలం ఆయా గ్రామాలకు చేరుకున్నారు. గోదావరి నది నుంచి తెచ్చిన జలాలతో గ్రామ దేవతలకు అభిషేకం చేపట్టారు.